భూపాల - ఆది తాళం ఖండగతి

పొలయలుక నిద్దురలు - భోగించ దొరకొంటి
వలరివడి మేల్కొనవె - అఖిలేశ్వర

1. తరుణిమైనపుడె పరి - తాప సూర్యుడు వొడిచె
వరుస జెలి కన్నుగలు - వలు మొగిచెను
మరుని సాయకపు తా - మరలు వడి వికసించె
కరుణతో మేల్కొనవె - కమలేశ్వరా...

2. కాంత నిట్టూర్పులను - గాలియును నగ్నియును
వంత చెమటల వాన - వరుణుండును
వింతలుగ నిన్ను సే - వింతుమని యున్నారు
పంతమున మేల్కొనవె - పరమేశ్వర....

3. మెలుత పెనుదురుమనెడి - మేఘ మండలములో
నలుగడలఁ జెలగె సుమ - నస పంక్తులు
కులికి పూవుల వాన - కురియంగ నున్నదిదె
చలముడిగి మేల్కొనవె - సర్వేశ్వరా ...

4. కదిసి పులకల సృష్టి - కడలేక పొడమించు
మదనుడను మానసక - మలభవుడును
ముదితకోపపుహరుడు - మొనసియున్నారిదె
నిదుర మేల్కొనవె జల - నిధి శయనుడ ..

5. ఒడికముగ జెలిలోన - నుదయరాగము వొడమె
వెడలె నవె పలుకుఁ గో - విలరవములు
పడతి గూడితివి రతి - పరవశంబికనైన
కడగి మేల్కొనవె వేం - కట రమణుడ ...

నిద్రబోయేస్వామికి  మేలుకొలుపు చూశాము క్రిందటి సంకీర్తనలో, ప్రణయపు టలుకల దొంగనిద్ర పోతున్నవానికి ఈ సానునయపు మేలుకొలుపు.

దొంగ యలుకల నిద్ర నటిస్తూ కులుకుదామనుకుంటున్నావు గానీ అఖిలేశ్వరా అతి త్వరగా లే. ఈ విచిత్రాలు తిలకించు సమయం మించిపోగలదు.

పరితాపం అనే సూర్యుడు తరుణి దేహాన ఉదయించాడు. ఆమె కన్ను కలువలు ఆ అరుణోదయం తాళలేక ముడుచుకొన్నవి. నీ వామెపై వేసిన మన్మధ బాణపు తామర లు మిక్కిలిగా వికసించినవి. (చెలియకై) కరుణతో మేల్కొనవయ్యా! కమలేశ్వరా.

ఈ సుందరి నిట్టూర్పులోని గాలీ, వేడీ అనే వాయ్వగ్నులూ, నీతోడి జగడాల పొడమి న ఘర్మవర్షమనే వరుణుడూ, వింతరీతులలో ( ఈమె నిట్టూర్పులూ, చెమట వానల

ద్వారా ) నిన్ను సేవించ పంతగించియున్నారు. ఈ విధంగా వారి సేవ లందుకొనేటందు లకై  పరమేశ్వరా మేలుకో.

మేఘమండలంవలె నున్న రమణి నెరికొప్పులో విరితురుములు అలరి ఉన్నవి. నీపై యిప్పుడు పూలవాన కురియబోతున్నదయ్యా కుహనాకోపం చాలించి సర్వేశ్వరా లేవయ్యా.

ఒడికముగ (మనోహరంగా, ఇంపుగా) ఈమెలో ఉదయరాగము ఉత్పన్నమైనది. ఆమని ఈమెను ఆశ్రయించింది. తార్కాణంగా ఆమెకు కోకిల కూజిత రవములు పలు కులై వెడలినవి. మునుపు ఆమెతో కలసి రతి పారవశ్యమందినాడవు. ఇప్పుడు కర్తవ్యమూ అదే. జాగుసేయకు. మేల్కొనవయ్యా ! వేంకటరమణుడా.

అంతులేని పులకరింతల సృష్టికర్త మనసు దామరలో జనించిన మన్మధుడను బ్రహ్మ, ఈ తరుణి కోప రూపం ధరించిన శివుడూ, నీకై వేచి ఉన్నారు. జలనిధి శయను డా ! నిదుర మేల్కొనవయ్యా.

అన్నమాచార్యుల శృంగారాధ్యాత్మిక విషయ సమ్మేళనపు మనోజ్ఞ రసజ్ఞ వైభవానికి అత్యద్భుత నిదర్శనం ఈ సంకీర్తనం. ఇందుగల అందం 'నభూతో న భవిష్యతి'.